# ఎడారిలో ఒంటె

-ఎమ్. సి. ఆంజనేయులు

పబ్లిక్ వర్క్స్ శాఖలో జూనియర్ ఇంజనీరుగా మూర్తికి సెలెక్షన్ అయితే వచ్చింది కానీ, ఆయనకు "సమతల పాదం" (Flat Foot) ఉందంటూ, తదుపరి పరీక్షల నిమిత్తం మెడికల్ బోర్డుకి రెఫర్ చేసింది సర్వీస్ కమిషన్.

చైర్మన్‌తో కలిసి ముగ్గురు సీనియర్ డాక్టర్లు మెంబర్లుగా ఉన్న మెడికల్ బోర్డు ఎదుట స్వయంగా హాజరై, బోర్డు నిర్వహించే మెడికల్ పరీక్షల్లో పాల్గొనవల్సిందిగా లెటర్ వచ్చింది మూర్తికి. కడప జిల్లా వైద్యాధికారి చైర్మన్‌గా ఉన్న ఆ బోర్డులో మిగిలిన మెంబర్లు- అనంతపురంలో పనిచేస్తున్న ఆర్థోపెడీషియన్, నెల్లూరు హెడ్‌క్వార్టర్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న జనరల్ ఫిజీషియన్.

పులివెందుల నుంచి ఆ ఉదయమే వచ్చిన మూర్తి, నిర్ణీత సమయానికి ముందుగానే, నిర్దేశ ప్రదేశం చేరుకున్నాడు. జిల్లా వైద్యాధికారి చాంబరు బయట ఉన్న బెంచీ మీద అప్పటికే ఇద్దరు బైఠాయించి ఉన్నారు.

> ## ఆచరణ
> పాండిత్యం ఉన్నతం
> బోధలు హిమాలయ పర్వతాలు
> ఆచరణ అణుమాత్రం
>
> ## చేసుకున్న కర్మ
> పెద్దలు ఆర్జిస్తున్నారు కోట్లు
> కడుపులు కొట్టి, పిల్లలకై
> చేరుతున్నారు వృద్ధాశ్రమాల్లో చివరకు
> సుఖలాలసులై భ్రష్టులౌతున్నారు పిల్లలు
>
> ## శరభయ్య
> ఆయన వేదికపై ఉంటే
> అతిథులకు వణుకు
> ఆయన సభలో ఉంటే
> సభికులకు బెరుకు
>
> -పరుచూరి శ్రీనివాసరావు

అందులో ఒక వ్యక్తి మరీ స్థూలకాయుడైతే, రెండో వ్యక్తి నకనకలాడుతూ, ఎండు పుల్లను తలపిస్తున్నాడు. 'వీళ్ళిద్దరు కూడా, బహుశా, వైద్య పరీక్షల కొరకు, సర్వీస్ కమిషన్ పంపగా వచ్చినవారై వుంటారు...' అని తలపోస్తూ, ఆ బెంచీ మీదే ఓ పక్క కూచున్నాడు మూర్తి.

కాస్సేపటికి చాంబరు తలుపులు తెరుచుకొని బిళ్ళ బంట్రోతు, దవాలీ సవరించుకుంటూ, బయటకు వచ్చాడు.

"మూర్తట! ఎవరిక్కడ మూర్తి...?" అంటూ బెంచీ మీదున్న ముగ్గురికేసి కాస్త దర్పంగా చూశాడు బంట్రోతు.

"నేనే-" అన్నట్లు తలాడించాడు మూర్తి.

"మీరేనా! పదండి లోపలికి- సార్ పిలుస్తున్నారు.." అన్నాడు బంట్రోతు.

వెంట తెచ్చుకున్న సర్టిఫికెట్ల ఫోల్డర్ని చేతపుచ్చుకొని బంట్రోతు వెనకే చాంబరులోనికి ప్రవేశించాడు మూర్తి.

అప్పటికే, అభ్యర్థి బయోడేటా షీట్లు పరీక్షిస్తున్న మెంబర్లు ముగ్గురూ, లోనికి వచ్చి తమ ఎదుట నిల్చున్న మూర్తి నొకమారు పరీక్షగా చూశారు.

మూర్తి మనోభావాలు, బాడీ లాంగ్వేజి, తొలి సారిగా ఆయన్ని చూస్తున్న వారికి ఒకింత విడ్డూరంగా అనిపిస్తాయి. ముక్కుసూటి మనస్తత్వం, ప్రవర్తనలో విధేయత, నమ్రత, సౌమ్యతలకు తావివ్వని మూర్తిమత్వం- మూర్తిది.

"బీ సీటెడ్ జెంటిల్‌మన్.." అంటూ తన కెదురుగా ఉన్న కుర్చీ చూపించాడు చైర్మన్.

కుర్చీలో కూలబడ్డాడు మూర్తి, ఒకింత అన్ కంఫర్టబుల్‌గా.

తల్లిదండ్రుల వివరాలు, పుట్టిన ఊరు, జిల్లా, చదివిన కాలేజి- ఇత్యాది వివరాలు అడిగి తెలుసుకున్నారు మెంబర్లు.

అన్ని ప్రశ్నలకూ పొడిపొడిగా, ముక్తసరిగా జవాబులిచ్చాడు మూర్తి.

"ఇంతకీ నీ ప్రాబ్లెం ఏమిటయ్యా? వాట్స్ రాంగ్ విత్ యూ...? సర్వీస్ కమిషన్ ఈ బోర్డు ముందు

హాజరు కమ్మని నిన్నెందుకు ఆదేశించింది...?"

చైర్మన్ వేసిన ఆ ప్రశ్న విన్న మూర్తి శరీర సంస్థితి అదోలా అయిపోయింది. జవాబు చెప్పడానికి తటపటాయిస్తూ, కుర్చీలో చికాగ్గా, అసహనంగా కదిలాడు.

"ఈయనికి 'ఫ్లాట్ ఫుట్' అట! సివిల్ ఇంజనీరుగా ఫీల్డు జాబ్‌కి పనికివస్తాడో- రాడో అని డౌట్‌పడి మన ఒపీనియన్ కోసం రెఫర్ చేసింది పబ్లిక్ సర్వీస్ కమిషన్..." చైర్మన్‌కేసి చూస్తూ, ఆయన పక్కనే ఉన్న ఆర్థోపెడీషియన్ అన్నాడు.

ముఖం గంటుపెట్టుకొని, కూచున్న కుర్చీలో, ఇంకా బిగుసుకుపోయాడు మూర్తి.

"ఏమిటేమిటి... నీకు ఫ్లాటు-ఫుట్టా! ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నావు నువ్వు..." మూర్తికేసి చూసి, కుతూహలంగా అడిగాడు చైర్మన్.

"పులివెందులలో. తుంగభద్రా హైలెవల్ కెనాల్ ఇన్వెస్టిగేషన్ సబ్ డివిజన్‌లో- జూనియర్ ఇంజనీరుగా..."

"ఓ... ఐసీ... ఇన్వెస్టిగేషన్... అంటే ఏం ఇన్వెస్టిగేట్ చేస్తారు...?"

"కాలువ... తుంగభద్ర ఎగువ కాలువ- అలైన్‌మెంట్ ఇన్వెస్టిగేషన్..."

"అదేనయ్యా! కాస్త అర్థమయ్యేటట్లు వివరించి చెప్పు..."

ఏమనుకున్నాడో, సర్దుక కూచుని, చైర్మన్ ముఖంలోకి చూస్తూ, పెదాలకు చిరునవ్వును అతికించుకొని ఇలా చెప్పాడు మూర్తి.

"పంట పొలాలకు నీరు అందించే సాగునీటి కాలువ ఏవిధంగా వెళుతుందో, మేము డీటెయిల్డ్ ఫీల్డ్ సర్వేస్ కండక్టుచేసి, అలైన్‌మెంట్ ఫైనలైజ్ చేయాలి. లెవెల్స్ తీయాలి. చాలా ప్రత్యామ్నాయాలు పరిశీలించాలి. ఇవన్నీ క్షేత్రస్థాయిలో చెయ్యాల్సి వుంటుంది..."

"అర్థమైంది... అర్థమైంది... ఊళ్ళూ, బీళ్ళూ, వాగులూ, వంకలూ, మిట్టలూ, పల్లాలూ, ఇవన్నీ తప్పుకుంటూ, దాటుకుంటూ, భూమిమీద, కాలువ వెళ్ళే మార్గాన్ని అలైన్‌మెంట్ అంటారన్నమాట. యామ్ ఐ రైట్ మూర్తీ! చాలా చాలా కష్టమైన పనే! అలైన్‌మెంట్ పక్కాగా పరిశోధించి, మీరు ఫైనలైజ్ చేశాక, ఆ ప్రకారం కాలువను తర్వాత తవ్వుతారన్నమాట. అది సరే! ఫీల్డ్‌వర్క్ చేసేందుకు, సైట్‌కి మీరు ఎలా వెళతారు..? జీపులున్నాయేమో కదా!"

## ముగ్గు

చిత్రంగా కురుస్తోంది వర్షం
అప్పటికప్పుడే ఎండా
అప్పటికప్పుడే వాన
దట్టంగా మేఘాలు కమ్మినై అనుకుంటే
క్షణాల్లో అన్నీ మాయమై పోయినై
గట్టిగా వానపడుతుందనుకుంటే
కళ్ళాపేసి పారిపోయింది.
ఇక చినుకు పడదని
వాకిలంతా అలికి అందంగా ముగ్గులేసుకుంటే
చిత్తడిగా బురద బురద చేసి పోయింది.
ఇది వర్షం కాదు, వట్టి మాయలమారి
నమ్ముకున్న రైతుల్నీ మోసగించింది
ముగ్గు పెట్టుకున్న నన్నూ మోసగించింది.

-వి. సూర్యారావు

చైర్మన్ మాటలకు మూర్తికి ఒళ్ళు మండిపోయింది.

"జీపులు, కార్లు ఎవరిస్తారు సార్! నడిచే వెళతాం. మళ్ళీ నడిచే వెనక్కి వస్తాం. నెలలో 15 రోజులు ఫీల్డ్‌వర్క్ చేయాల్సి ఉంటుంది. ఫీల్డ్ సర్వేస్ చేసేరోజు కనీసం పదిమైళ్ళు నడవాల్సి ఉంటుంది..." ఆవేశంగా చెప్పుకపోతున్నాడు మూర్తి.

"మైగాడ్.. పదిమైళ్ళా... కష్టమనిపించదూ...!" ఆశ్చర్యంగా అన్నాడు చైర్మన్.

"ఒక్కోమారు 15 మైళ్ళు కూడా కవర్ చెయ్యాలి. అలవాటైపోయింది..." అన్నాడు మూర్తి గర్వంగా.

"నీకు ఫ్లాటు ఫుట్టు ఉంటే మాత్రం ఏమైందీ! యు ఆర్ ఫర్‌ఫెక్ట్లీ ఫిట్ టు బి ఎ సివిల్ ఇంజనీర్. నీ సెలెక్షన్ మేము రెకమెండ్ చేస్తున్నాం. ఇంకేం పరీక్షలు అవసరం లేదుగా. నువ్వెళ్ళొచ్చు హ్యాపీగా..." అభయమిచ్చాడు చైర్మన్.

నవ్వుకుంటూ బయటకు నడిచాడు మూర్తి.

రిటైరయ్యి విశ్రాంత జీవితం గడుపుతున్న మూర్తికిప్పుడు 70 ఏళ్ళు. ఆనాడు మెడికల్ బోర్డు, ఫ్లాట్ ఫుట్ ఉన్న మూర్తిని సివిల్ ఇంజనీర్‌గా పనికి రావంటూ డిస్‌క్వాలిఫై చేసివుంటే- నిబద్ధతతో పనిచేసే ఓ మంచి ఇంజనీర్‌ను ఇరిగేషన్ శాఖ కోల్పోయి ఉండేది. ■